
www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 31 జనవరి 2024
5
పశ్చిమ గోదావరి



మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్‌గా శ్రీవిద్య


కమిషనర్‌ను కలిసిన శ్రీవిద్య

ప్రజాశక్తి - భీమవరంరూరల్
భీమవరం పుర పాలక సంఘం అసిస్టెంట్ కమిషనర్‌గా ఎ.శ్రీవిద్య మంగళవారం బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు చేపట్టిన అంతరం మున్సిపల్ కమిషనర్ శ్యామలాదేవిని మర్యాదపూర్వంకంగా కలిశారు. శ్రీవిద్య కాకినాడ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీలో ఎఒగా పనిచేసి బదిలీల్లో భాగంగా భీమవరం అసిస్టెంట్ కమిషనర్‌గా వచ్చారు.

పార్లమెంట్‌లో గళమెత్తేనా..!

- జిల్లాలో ప్రధాన సమస్యలపై ఎంపీలు మౌనం
- కొల్లేరు ఎకోసెన్సిటివ్ జోన్‌తో ప్రజల్లో అలజడి
- పోలవరం నిర్వాసితులకు అందని పరిహారం
- ధర లేక పామాయిల్ రైతులు విలవిల
- కౌలురైతులకు వర్తించని పిఎం కిసాన్ సమ్మాన్ నిధి
- నేటి నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మోడీ ప్రభుత్వానికి ఐదేళ్ల పదవీ కాలం పూర్తి కానుండటంతో ఇవే చివరి పార్లమెంట్ సమావేశాలు. ఈ సమావేశాల్లో ఓటాన్ అకౌంట్ బడ్జెట్ మాత్రమే ప్రవేశపెట్టనున్నారు. అయితే జిల్లాకు సంబంధించి కేంద్రం పరిధిలో అనేక సమస్యలు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్నాయి. సాధారణ ఎన్నికల ముందు జరుగుతున్న ఈ సమావేశాల్లో ప్రధాన సమస్యలను జిల్లాకు చెందిన ఎంపీలు లేవనెత్తి పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా ప్రజానీకం కోరుతున్నారు.



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి
జిల్లాలో పోలవరం నిర్వాసితుల సమస్య ప్రధానమైందని చెప్పొచ్చు. 2014లో రాష్ట్ర విభజన సందర్భంగా పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా చట్టంలో పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించిన ఖర్చు మొత్తం కేంద్ర ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు. టిడిపి ప్రభుత్వ హయాంలో పోలవరం ఖర్చుకు సంబంధించి డిపిఆర్‌ను తయారు చేసి కేంద్రానికి పంపించింది. ప్రాజెక్టుకు మొత్తం రూ.58 వేల కోట్లు వరకూ అవుతుందని, అందులో రూ.32 వేల కోట్లు నిర్వాసితులకు పరిహారంగా అందించాల్సి ఉందని తెలిపింది. రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు గడిచిపోయింది. పోలవరం ప్రాజెక్టు 80 శాతం వరకూ పూర్తయినట్లు రాష్ట్ర ప్రభుత్వం లెక్కలు చెబుతోంది. ఇప్పటి వరకూ మాత్రం నిర్వాసితులకు పూర్తిస్థాయిలో పరిహారం మాత్రం అందించలేదు. జిల్లాలో కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో 103 గ్రామాల పరిధిలో 20 వేలకుపైగా కుటుంబాలు నిర్వాసితులు కానున్నాయి. వీరికి పునరావాస ప్యాకేజీ, భూమికి భూమి, 18 ఏళ్లు నిండిన యువతకు పరిహారం, ఇళ్ల నిర్మాణం వంటివి చేయాల్సి ఉంది. పరిహారం ఇస్తే తప్ప తాము గ్రామాలను ఖాళీ చేసే ప్రసక్తి లేదని నిర్వాసితులు చెబుతున్నారు. కేంద్రం నిధులిస్తే తప్ప నిర్వాసితులకు పరిహారం ఇవ్వలేమని సిఎం జగన్ తేల్చి చెప్పేశారు. దీంతో ప్రతియేటా జులై, ఆగస్టు నెలల్లో విరుచుకుపడుతున్న వరదలకు గ్రామాలన్నీ ముంపుబారిన పడటం, నిర్వాసితులంతా కొండలు, గుట్టలపై బిక్కుబిక్కుమంటూ జీవనం సాగించడం వంటి భయంకర పరిస్థితులు కొనసాగుతున్నాయి.


ఏలూరు, అరకు పార్లమెంట్ నియోజకవర్గాల్లో నిర్వాసితుల సమస్య ప్రధానంగా ఉంది. నిర్వాసితుల సమస్యను చివరి పార్లమెంట్ సమావేశాల్లోనైనా ఎంపీలు లేవనెత్తి పరిహారం అందేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

కొల్లేరుపై కేంద్రం మోసం

2014 ఎన్నికల సందర్భంగా భీమవరంలో జరిగిన ఎన్నికల సభలో అప్పట్లో ప్రధాని అభ్యర్థిగా ఉన్న మోడీ మాట్లాడుతూ కొల్లేరును మూడో కాంటూరుకు కుదిస్తామని, కొల్లేరుకు న్యాయం చేస్తామని చెప్పారు. కైకలూరు నియోజకవర్గం నుంచి బిజెపి అభ్యర్థిగా కామినేని శ్రీనివాస్ పోటీ చేసి గెలవడం సైతం జరిగింది. కొల్లేరులో సర్వే పేరుతో అప్పట్లో కేంద్ర ప్రభుత్వం హడావుడి సైతం చేసింది. కొల్లేరును మూడో కాంటూరుకు కుదించాలని రాష్ట్రంలో అధికారంలో ఉన్న టిడిపి, బిజెపి ఉమ్మడి ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించింది. కొల్లేరును మూడో కాంటూరుకు కుదించకపోగా, తాజాగా కొల్లేరు ఎకోసెన్సిటివ్ పేరుతో పదో కాంటూరు వరకూ విస్తరించేందుకు కేంద్రం సిద్ధమవగా, రాష్ట్ర ప్రభుత్వం వంత పాడుతోంది. కొల్లేరులో హెలీకాప్టర్‌తో సర్వే నిర్వహించారు. మండల కేంద్రాల్లో ప్రజాభిప్రాయ సేకరణ పేరుతో సమావేశాలు నిర్వహించి గతంలో ఉన్న 120 గ్రామాలు కాకుండా మరో 89 గ్రామాలను ఎకోసెన్సిటివ్ జోన్ పరిధిలోకి తెచ్చేందుకు నివేదికలు తయారు చేశారు. దీన్ని కొల్లేరు ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా ప్రభుత్వం మొండిగా ముందుకు సాగుతున్న పరిస్థితి ఉంది. ఎకోసెన్సిటివ్ జోన్ అమల్లోకి వస్తే కొల్లేరుతోపాటు చుట్టుపక్కల గ్రామాల అభివృద్ధి మొత్తం ఆగిపోనుంది. దాదాపు ఐదు లక్షల మంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడనున్నారు. కొల్లేరును మూడో కాంటూరుకు కుదించడం, ఎకోసెన్సిటివ్ జోన్ నిలుపుదలపైనా జిల్లాకు చెందిన ఎంపీలు పార్లమెంట్‌లో ప్రస్తావించాలని ప్రజలు కోరుతున్నారు.

కౌలురైతులకు పిఎం కిసాన్ సమ్మాన్ నిధి ఏది?

జిల్లాలో అత్యధికంగా మూడు లక్షల మంది కౌలురైతులు ఉన్నారు. రాష్ట్రంలోనూ అత్యధికంగా కౌలురైతులు వ్యవసాయ సాగు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు ఏడాదికి పిఎం కిసాన్ సమ్మాన్ నిధి కింద అందించే రూ.ఆరు వేల సాయం వాస్తవ సాగుదారుడైన కౌలురైతులకు అందడం లేదు. దీంతో కౌలురైతులకు తీరని అన్యాయం జరుగుతోంది. ఈసారి పిఎం కిసాన్ నిధి కింద ఇచ్చే సొమ్ము రూ.తొమ్మిది వేలకు పెంచనున్నట్లు ప్రచారం సాగుతోంది. అదే క్రమంలో తమకూ వర్తించేలా ఎంపీలు పార్లమెంట్‌లో గళమెత్తాలని కౌలు రైతులు కోరుతున్నారు. జిల్లాలో లక్షా 50వేల ఎకరాల్లో పామాయిల్ సాగు ఉంది. ఆయిల్ దిగుమతులపై కేంద్రం పన్ను తగ్గించడంతో దేశీయంగా పండించే పామాయిల్ ధర భారీగా పడిపోయింది. టన్ను పామాయిల్ ధర ఈ ఏడాది రూ.12,200 మాత్రమే పలికింది. గతేడాది టన్ను రూ.23 వేలు వరకూ పలికిన పరిస్థితి ఉంది. పామాయిల్ ధర పడిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయం జిల్లాలోని పామాయిల్ రైతులపై తీవ్ర ప్రభావం పడింది. పామాయిల్ రైతుల సమస్యలపై పార్లమెంట్‌లో ఎంపీలు మాట్లాడి ధర విషయంలో న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు. ఇక జిల్లాలో సాగుతున్న గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణంలో బ్రిడ్జిలు నిర్మించిన చోట సర్వీసు రోడ్లు నిర్మించడం లేదు. దీంతో రైతులు తాము పండించిన పంటను తరలించే పరిస్థితి లేకుండా పోతుంది. సర్వీసు రోడ్ల నిర్మాణంపై పార్లమెంట్‌లో ఎంపీలు మాట్లాడాలని రైతులు కోరుతున్నారు.


దీక్షల్లో కూర్చున్న నేతలు

రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలి

ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు సాధన సమితి
భీమవరంలో దీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి - భీమవరం
రాష్ట్రానికి ప్రత్యేక హోదా, నిధులు, రాజధాని నిర్మాణానికి, వెనుకబడిన జిల్లాలు, ప్రాంతాలకు ప్యాకేజీ, రైల్వేజోన్ ఇవ్వాలని ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు సాధన సమితి డిమాండ్ చేసింది. మంగళవారం స్థానిక ప్రకాశం చౌక్ సెంటర్లో గాంధీవర్ధంతి, అమర వీరుల దినం పురస్కరించుకుని గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆంధ్రుల హక్కుల ఆత్మగౌరవ దీక్షను సమితి ఆధ్వర్యంలో చేపట్టారు. వామపక్ష నాయకులు, వివిధ ప్రజాసంఘాల నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొని దీక్షలో కూర్చుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ మాట్లాడుతూ రాష్ట్రానికి పదేళ్లపాటు ప్రత్యేక హోదా ఇస్తామని హామీ ఇచ్చిన మోడీ ఇంతవరకు ప్రత్యేక హోదా ఇవ్వకుండా రాష్ట్రానికి తీరని ద్రోహం చేశారన్నారు. విభజన హామీల్లో ఉన్న కడపలో ఉక్కు ఫ్యాక్టరీ, విశాఖకు రైల్వేజోన్, రాజధాని నిర్మాణానికి నిధులు, పోలవరం ప్రాజెక్టుకు నిధులు ఇస్తామని ఏఒక్కటీ ఇవ్వలేదన్నారు. రాష్ట్రంలో కీలకంగా ఉన్న విశాఖ స్టీల్ ప్లాంట్‌ను అమ్మకానికి పెట్టి రాష్ట్రానికి బిజెపి ప్రభుత్వం ద్రోహం చేసిందన్నారు. వైసిపి ప్రభుత్వం, వైసిపి ఎంపీలుగాని పార్లమెంట్‌లో విభజన హామీల గురించి నోరు మెదపకుండా వ్యవహరిస్తూ రాష్ట్రానికి ద్రోహం చేసే విధానాలన్నింటికీ సై అంటున్నారన్నారు. జగన్ అంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆంధ్రులను వెన్నుపోటు పొడిచారని విమర్శించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు మాట్లాడుతూ 2014లో విభజన సందర్భంగా పార్లమెంట్ సాక్షిగా ఎపికి ఇచ్చిన విభజన హామీలు వేటినీ అమలు చేయకుండా తాత్సారం చేస్తున్నారని మండిపడ్డారు. కౌలురైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రానికి ప్రత్యేక హోదా వస్తే కొన్ని రాయితీలు, సౌకర్యాలు దక్కేవన్నారు. నిరుద్యోగ యువత, ప్రజానీకం ప్రత్యేక హోదా సాధనకు జరిగే దశలవారీ ఆందోళనను బలపర్చాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.వాసుదేవరావు, సిపిఐ జిల్లా నాయకులు చెల్లబోయిన రంగారావు, మల్లుల సీతారాంప్రసాద్, కాంగ్రెస్ భీమవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి వంశీరెడ్డి శ్రీను, ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కార్యదర్శి దండు శ్రీనివాసరాజు, వెంకటపతిరాజు, వ్యవసాయకార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, సిపిఎం నేతలు కలిపిండి సత్యనారాయణ, ఎం.ఆంజనేయులు, దేగల నాగు పాల్గొన్నారు.

జిల్లా ఎస్‌పిగా అజిత వేజెండ్ల

ఎసిబి ఎస్‌పిగా రవిప్రకాష్ బదిలీ



ప్రజాశక్తి - భీమవరం
జిల్లా ఎస్‌పిగా అజిత వేజెండ్లను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జగ్గయ్యపేట డిసిపిగా పని చేస్తున్న అజిత బదిలీపై జిల్లాకు ఎస్‌పిగా వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎస్‌పిగా పని చేసిన యు.రవిప్రకాష్ ఎసిబి ఎస్‌పిగా బదిలీ అయ్యారు. విభజిత పశ్చిమగోదావరి జిల్లాకు తొలి ఎస్‌పిగా రవిప్రకాష్ పని చేశారు.

గీత కార్మిక సంఘం రాష్ట్ర మహాసభ ఆరంభం

కదంతొక్కిన కల్లుగీత కార్మికులు
పట్టణంలో మోకులతో ర్యాలీ
వృత్తిని కాపాడేవారికే మద్దతు : 80 వసంతాల సభలో నేతలు



తణుకులో మోకులు ధరించి ర్యాలీ నిర్వహిస్తున్న కల్లుగీత కార్మికులు

ప్రజాశక్తి - తణుకురూరల్
'కల్లు తాగడం ఆరోగ్యకరమే.. అయినా గీత వృత్తిని దెబ్బతీస్తూ ప్రజల ప్రాణాలను హరించే మద్యం అమ్మకాలను ప్రభుత్వం ప్రోత్సహించడం దారుణం. ప్రభుత్వం తన తీరు మార్చుకుని గీతవృత్తి పరిరక్షణకు చర్యలు చేపట్టకపోతే వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతాం.. గీతకార్మిక వృత్తిని పరిరక్షించేలా ఎన్నికల ప్రణాళికలో విధానాలు ప్రకటించిన వారికే మా మద్దతు' అంటూ కల్లుగీత కార్మికులు మంగళవారం తణుకు పట్టణంలో కదంతొక్కారు. ఎపి కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర మహాసభ ప్రారంభం సందర్భంగా మంగళవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ మున్సిపల్ కార్యాలయం వద్ద నుండి నరేంద్ర సెంటర్, వెంకటేశ్వర సెంటర్ మీదుగా లయన్స్‌క్లబ్ ఆడిటోరియం వరకూ సాగింది. ర్యాలీ అగ్రభాగాన గీత కార్మికులు, నేతలు మోకులు ధరించి పాల్గొనడం అందరి దృష్టిని ఆకర్షించింది. అనంతరం సంఘం ఏర్పడి 80 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా లయన్స్ ఆడిటోరియంలో 80 వసంతాల సభ నిర్వహించారు. ఈ సభకు ఆహ్వాన సంఘం అధ్యక్షులు కామన మునిస్వామి అధ్యక్షత వహించారు. తొలుత కీర్తిశేషులు సంఘం సీనియర్ నేత చిటకన వెంకటేశ్వరరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎంవి.రమణ మాట్లాడుతూ ఈ రాష్ట్రంలో గీత కార్మికుల బతుకులు మారాలని మోకులు ధరించి రోడ్లపైకి వస్తున్నారంటే జగన్మోహన్‌రెడ్డి పాలన ఎలా ఉందో అర్థమవుతోందన్నారు. కూల్‌డ్రింక్స్, మద్యపానం ఆరోగ్యానికి హానికరమని, కల్లు ఆరోగ్యానికి మంచిదన్నారు. వృత్తి రక్షణ, ఆధునికీకరణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, లేకుంటే కల్లుగీత కార్మికుల జీవితాలు బాగుపడేలా చర్యలు తీసుకునేవారికే తమ మద్దతు ఉంటుందని తెలిపారు. సంఘం మాజీ జిల్లా గౌరవాధ్యక్షులు, మాజీ ఎంఎల్ఎ దిగుపాటి రాజగోపాల్ మాట్లాడుతూ పాదయాత్రలో గీత కార్మికులకు ఇచ్చిన హామీలు ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. కల్లుగీత వృత్తిని, ఉపాధిని కార్మికులు సంఘటితంగా రక్షించుకోవాలన్నారు. చీప్‌లిక్కర్, బ్రాందీలను ప్రోత్సహించి లాభాలు గడిస్తున్నారని, కల్లు వల్ల ప్రభుత్వానికి లాభాలుండవనే పేరుతో గీత వృత్తిని నిర్వీర్యం చేస్తుందన్నారు. వృత్తిదారుల సంఘం రాష్ట్ర కన్వీనర్ ఎం.భాస్కరయ్య మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో సమస్యలు పరిష్కారమవుతాయని ఐదు సంవత్సరాలు ఎదురుచూసినా ఒక్క సమస్య కూడా పరిష్కారం కాలేదని విమర్శించారు. గీత కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే, గీత కార్మికులు చెట్లు ఎంత వేగంగా ఎక్కగలరో, కల్లు ఎంత వేగంగా దించగలరో అంతే వేగంతో ప్రభుత్వాన్ని దించగలరని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జుత్తిగ నరసింహమూర్తి, జిల్లా ఉపాధ్యక్షులు గుబ్బల వీరరాఘవులు, సహాయ కార్యదర్శి కడలి పాండు, సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, వివిధ సంఘాల నేతలు పివి.ప్రతాప్, గార రంగారావు, గుబ్బల గోపి, మాజీ మున్సిపల్ ఛైర్మన్ దొమ్మేటి వెంకటసుధాకర్, కోట నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజగోపాల్, దొమ్మేటి వెంకట సుధాకర్


మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు జుత్తిగ నరసింహమూర్తి


కీర్తి శేషులైన సీనియర్ నేతలకు నివాళులర్పిస్తున్న నేతలు

భూహక్కు యాజమాన్య చట్టాన్ని రద్దు చేయాలి


నరసాపురం : నల్లబెలూన్లతో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

ప్రజాశక్తి - నరసాపురం
రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఆంధ్రప్రదేశ్ భూహక్కు యాజమాన్య చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని కోరుతూ న్యాయవాదులు మంగళవారం పట్టణంలో నల్ల బెలూన్లతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. తొలుత గాంధీ విగ్రహానికి న్యాయవాదులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అంబేద్కర్ సెంటర్ వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నరసాపురం బార్ అసోసియేషన్ నాయకులు పోలిశెట్టి శ్రీరఘురామారావు, పోలిశెట్టి సూరిబాబు, ఆర్‌జి.కుమార్, నారిన శ్రీనివాసరావు, బి.ప్రగతి, దేవ రంజిత్‌కుమార్, ఓసూరి జ్యోతిమాంగళ్య, కొత్తపల్లి రమేష్ మాట్లాడారు. ఈ చట్టం భూవివాదాలు తగ్గడం కాకుండా మరిన్ని పెరుగుతాయన్నారు. ప్రజల రాజ్యాంగ, చట్టబద్దమైన హక్కులను కాపాడేందుకు ఈ కొత్త చట్టాన్ని రద్దు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఇజె.దాసు, దొంగ నరసింహరాజు, మేడిది శ్రీమంత్, సోడదాసి శ్రీధర్, ఆకుల సుబ్రహ్మణ్యం, వై.నాయుడు, నక్కా కుమార్‌రత్నం, మేడపాటి గంగాధర్‌రెడ్డి, పుప్పాల వెంకటకృష్ణారావు, దొంగ సుభాష్‌బాబు, కంభాల స్వర్ణ, కురెళ్ల సోమశేఖర్, కామన బాల సత్యనారాయణ, కురెళ్ల అన్నపూర్ణ, టి.కరుణానిధి, నిడుమోలు ఆనందచక్రవర్తి, డి.ఛాముండేశ్వరి, కె.ఏసుబాబు, జె.సైమన్ విజయ్‌కుమార్, ఉల్లంపర్తి సత్యనారాయణ, వనమాల శ్రీనివాసరావు, చేగొండి బాలాజీ, నక్కా ఆనంద్‌బాబు, చెన్నూరి వెంకటేశ్వరరావు, బసవా నమశివాయ, కొల్లాబత్తుల శేఖర్, గోడి సత్యనారాయణ, నెక్కంటి క్రాంతికుమార్, కొమ్ముల నారాయణమూర్తి, గోరింకల వినోద్, గుంపుల సాగర్, కొప్పినీడి చిట్టిపద్మజ, రంపా పుల్లాజీ, గొల్లమందల సత్యనారాయణ, డివివి.జనార్ధన్‌ప్రసాద్ పాల్గొన్నారు.

పాలకొల్లు: ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ప్రజల ఆస్తులకు తీవ్ర నష్టం కలిగిస్తుందని, వెంటనే ప్రతిపాదిత చట్టాన్ని ఉపసంహరించుకోవాలని పాలకొల్లు బార్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. స్థానిక కోర్టు ఎదుట బార్ సభ్యులు మంగళవారం దీక్షలు నిర్వహించారు. ఈ దీక్షల్లో బార్ అసోసియేషన్ అధ్యక్షులు తలుపుల శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి వేదాల నాగరాజు, ఎం.ఆంజనేయులు, వీరా వీర్రాజు, కత్తుల సత్యనారాయణ, పిట్టా రాజ్‌కుమార్, కర్రి యోహాను, నిమ్మకాయల హిమబిందు, గాదిరాజు లక్ష్మి, మాంద్రు ప్రసన్నకుమార్, జిళ్లెళ్ల సాల్మన్‌రాజు, సీనియర్ న్యాయవాదులు చెరుకూరి మురళీధర్, పిల్లా బాలాజీ, గంధం వెంకట సుబ్బారావు దిరిశాల హరగోపాల్ పాల్గొన్నారు.

అందరి ఆశీస్సులతో మళ్లీ గెలుస్తా

ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు


మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ శ్రీరంగనాథరాజు

ప్రజాశక్తి - పోడూరు
సార్వత్రిక ఎన్నికల్లో అందరి ఆశీస్సులతో మళ్లీ ఎంఎల్ఎగా గెలుపొంది నియోజకవర్గ అభివృద్ధిలో పాల్పంచుకుంటానని ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు తెలిపారు. తూర్పుపాలెం క్యాంపు కార్యాలయం వద్ద ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఆసరా కార్యక్రమాన్ని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ ఆచంట నియోజకవర్గ పరిశీలకురాలు మేడపాటి షర్మిలారెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడారు. 2019లో మహిళలు తనను ఆశీర్వదించి ఎంఎల్‌ఎను, తరువాత మంత్రిని చేశారని తెలిపారు. అందరికీ రుణపడి ఉన్నానని తెలిపారు. గడపగడపకూ సమస్యలు తెలుసుకుని పరిష్కరించారని, ఇంకా చేయాల్సిన పనులు చాలా ఉన్నాయని తెలిపారు. అనంతరం డ్వాక్రా అక్క చెల్లెమ్మలకు భోజనం పెట్టి చీరలు అందజేశారు. టిడిపి నాయకుల మాయ మాటలు నమ్మి మోసపోవొద్దని హితవుపలికారు. మహిళలకు ఆర్థిక ఆసరా కల్పిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు, ఎంపిటిసిలు, సర్పంచులు పాల్గొన్నారు.

పాలకొల్లు ఎఎంసి ఛైర్మన్‌గా దేవి

వైస్ ఛైర్మన్‌గా డిటిడిసి బాబు


ఎన్నికైన ప్రతినిధులను సత్కరిస్తున్న ప్రముఖులు

ప్రజాశక్తి - పాలకొల్లు
పాలకొల్లు ఎఎంసి నూతన పాలకవర్గం ఎట్టకేలకు కొలువుదీరింది. ఛైర్మన్‌గా సాలా దేవి నరసయ్య, వైస్ ఛైర్మన్‌గా డిటిడిసి బాబు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపి ఆధ్వర్యంలో వారు బాధ్యతలు చేపట్టారు. సభ్యులుగా కలిగితి సుగుణ సుందరకుమారి, కళ్యాణం గంధర్‌రావు, వడ్లపాటి సుజన కుమారి, కుసుమ ఝాన్సీ మేరీ హేమలత, మేళం శేషవేణి, సప్పరపు శంకర పార్వతి, దొమ్మేటి ఏడుకొండలు, మొహమద్ జరీనాబేగం, మంద హరికుమార్, దొంగ నాగలక్ష్మి, నడపన వెంకట సుబ్బారావు, సనిశెట్టి లీలా భావన్నారాయణ, జమ్ము మృత్యుంజయరావు, జిన్నూరు పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సి కమిషన్ సభ్యులు చెల్లెం ఆనంద ప్రకాష్, డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ, జెడ్‌పిటిసి నడపన గోవిందరాజులు నాయుడు, మాజీ ఎఎంసి ఛైర్మన్ సాలా నర్సయ్య, కిరాణా మర్చెంట్స్ సంఘ పెద్దలు పాల్గొన్నారు.


వాటర్ ట్యాంకు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న పివిఎల్

స్వచ్ఛమైన తాగునీరందించడమే లక్ష్యం

డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు

ప్రజాశక్తి - ఉండి

ప్రతి ఒక్కరికీ స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు అన్నారు. మంగళవారం పాందువ్వ గ్రామంలో జల జీవన్ మిషన్ పథకంలో భాగంగా వాటర్ ట్యాంక్ నిర్మాణానికి పివిఎల్ నరసింహరాజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పివిఎల్ మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రతి ఒక్కరికీ స్వచ్ఛమైన తాగునీరందించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందన్నారు. జల జీవన్ మిషన్‌లో భాగంగా గ్రామానికి రూ.81 లక్షలు మంజూరయ్యాయని, 62 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంక్ నిర్మాణం వేగవంతంగా పూర్తి చేసి తొందరలోనే ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు. అనంతరం పైపులైన్ విస్తరణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు, నాయకులు అల్లూరి రాంబాబు రాజు, దెందుకూరి నరసింహరాజు, పెన్మెత్స సుబ్బరాజు, జి.సుందర్ కుమార్ పాల్గొన్నారు.

బాధితునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఆపదలో ఉన్నవారికి సాయం చేయడం మానవ ధర్మమని కృష్ణ బలిజ సేవా సమితి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, టిడిపి బిసి సాధికార కమిటీ డైరెక్టర్ గంటా త్రిమూర్తులు అన్నారు. లివర్ క్యాన్సర్‌తో బాధపడుతున్న భీమవరం 3వ వార్డుకు చెందిన కప్పిరి మనోహర్‌కు గంటా త్రిమూర్తులు, నాగలక్ష్మి దంపతులు రూ.15 వేల ఆర్థిక సాయం మంగళవారం అందజేశారు. ఇటీవల మనోహర్ తల్లి అనారోగ్యంతో మృతి చెందారు. ఆవిడకు కూడా గతంలో రూ.10 వేలు అందజేశామని దాతలు తెలిపారు. కార్యక్రమంలో గంటా నాగలక్ష్మి, టిడిపి సీనియర్ నాయకులు మద్దుల రాము, ఎం.ఐజాక్ బాబు పాల్గొన్నారు.

మంత్రి గోవర్ధన్‌రెడ్డిని కలిసిన జానకీరామ్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డిని, వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ టి. జానకీరామ్ మంగళవారం విజయవాడ క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. నూతన సంవత్సరంలో ఉద్యాన విశ్వవిద్యాలయం చేపడుతున్న వివిధ కార్యక్రమాల గురించి, విశ్వవిద్యాలయం సాధించిన పురోగతి గురించి ఆయన మంత్రికి తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు, విస్తరణ సంచాలకులు ఇఇ.కరుణశ్రీ ఉన్నారు.

జంతు పరిరక్షణపై వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

మూగజీవాలను ఆదరించడం, ప్రేమించడం మానవత్వమని జిల్లా పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కె.మురళీకృష్ణ అన్నారు. మంగళవారం భీమవరం పశువుల ఆసుపత్రి ఆవరణలో జిల్లా పశు సంవర్ధక శాఖ, జిల్లా జంతు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జంతు పరిరక్షణ పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ మూగజీవాలను హింసించడం చట్టరీత్యా నేరమన్నారు. డిప్యూటీ డైరెక్టర్ జాఫర్ హుస్సేన్, ఎడి డాక్టర్ ఎ.సత్యనారయణ మాట్లాడుతూ 10 రోజులుగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ 3 పాఠశాలల్లో విద్యార్థులకు జంతు పరిరక్షణపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించామన్నారు. అనంతరం ఎస్‌పిసిఎ జిల్లా సభ్యులుగా నియమితులైన గంటా సుందర్ కుమార్‌ను జిల్లా పశు సంవర్ధక శాఖ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో భట్టిప్రోలు శ్రీనివాసరావు, కెసి.రాజు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు అండగా ఉంటా

ఎంఎల్ఎ మంతెన రామరాజు

ప్రజాశక్తి - ఉండి

అగ్నిప్రమాద బాధితులకు అండగా ఉంటామని ఎంఎల్ఎ మంతెన రామరాజు అన్నారు. మంగళవారం తెల్లవారుజామున ఉప్పులూరులో జరిగిన అగ్నిప్రమాదంలో గ్రామానికి చెందిన గంటా శ్రీలత కుటుంబం నిరాశ్రయులైంది. ఈ నేపథ్యంలో ఎంఎల్ఎ మంతెన రామరాజు బాధితులను పరామర్శించి మాట్లాడారు. ప్రభుత్వం శ్రీలత కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు. శ్రీలత కుటుంబానికి తక్షణ సాయంగా బియ్యం బస్తా, నగదు పార్టీ నాయకులు విరాళం అందజేసినట్లు తెలిపారు. గ్రామ రెవెన్యూ అధికారి అద్దంకి బాబి మాట్లాడుతూ మంగళవారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో అగ్ని ప్రమాదం సంభవించిందని,శ్రీలత ఆమె కుమారుడు ఇంట్లోంచి బయటికి వచ్చి కేకలు వేయగా చుట్టుపక్కల వారు మంటలను అదుపు చేశారని, రూ.లక్ష ఇరవై వేల ఆస్తి నష్టం అంచనా వేసి ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించామని తెలిపారు.


డైరీని ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ఎపిడబ్ల్యూజెఎఫ్ డైరీ ఆవిష్కరించిన కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ - 2024 డైరీని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి కలెక్టరేట్లో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో సమాజాభివృద్ధికి మీడియా ప్రధాన పాత్ర వహిస్తోందన్నారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో మీడియా విజయవంతంగా తమ సేవలందించాలన్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్ సుందర్‌రెడ్డికి, జిల్లా సమాచార శాఖ ఎడి నాగేశ్వరరావుకు డైరీని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ గుండా రామకృష్ణ, ఫెడరేషన్ అధ్యక్షులు వేగిరాజు రాధాకృష్ణ, కార్యదర్శి గూడూరి నాగరాజు, కన్వీనర్ కెఎస్ఎల్ఎన్ నాని, ఉండ్రు నరేష్, గుత్తుల సూర్య, శలా బ్రహ్మేంద్ర, తిరుమల ప్రసాద్, శివవర్మ, కేతా సత్యనారాయణ, కడలి సాయిబాబా, ఆదిత్య బాబీ, మద్దిరాల రాజేష్, అంజి పాల్గొన్నారు.

ధర్మకర్తల మండలి నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

కాళ్ల:కాళ్లకూరులోని వెంకటేశ్వరస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి నియామకం కోసం నోటిఫికేషన్ వెలువడిందని ఆలయ ఇఒ మోకా అరుణ్ కుమార్ మంగళవారం తెలిపారు. దేవదాయ ధర్మాదాయ శాఖ ఉప కమిషనర్ ఈ నెల 27న నోటిఫికేషన్ జారీ చేశారన్నారు. ఆసక్తి గలవారు, అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దేవదాయ ధర్మాదాయ శాఖ చట్టంలో నిర్ణయించిన ప్రొఫార్మా -2 ప్రకారం దరఖాస్తులు 20 రోజుల్లోపు స్వామివారి ఆలయ ఆఫీసులో అందజేయాలని కోరారు.


నేడు 'విద్యారంగంలో సంస్కరణలు'పై సదస్సు

నరసాపురం: 'విద్యారంగంలో సంస్కరణలు-యువత సాధికారత సాధించేందుకు వస్తున్న సవాళ్లు' అనే అంశంపై ఈ నెల 31న బుధవారం స్థానిక వైఎన్ కళాశాలలో సదస్సు నిర్వహించనున్నట్లు ఆ కళాశాల కరస్పాండెంట్ చినిమిల్లి సత్యనారాయణ తెలిపారు. ఈ సదస్సుకు ఉన్నత విద్యామండలి వైస్ ఛైర్మన్ ప్రొఫెసర్ కె.రామ్మోహనరావు ముఖ్యఅతిథిగా విచ్చేస్తారని చెప్పారు. ఈ సదస్సులో తమ కళాశాల విద్యార్థులతోపాటు సూర్య, గౌతమి కళాశాల విద్యార్థులు కూడా పాల్గొంటారని తెలిపారు.

క్రీడలతో గుర్తింపు : ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి

ప్రజాశక్తి - నరసాపురం

యువతీ యువకులు క్రీడల్లో పాల్గొనడం వల్ల సమాజంలో గుర్తింపు పొందుతారని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. ఆడుదాం ఆంధ్రలో భాగంగా నరసాపురం నియోజకవర్గ స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులకు మంగళవారం స్థానిక వైఎన్ కళాశాల ప్రాంగణంలో బహుమతుల ప్రదాన కార్యక్రమానికి ముదునూరి ప్రసాదరాజు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖోలో గెలుపొందిన విజేతలకు ఆర్‌డిఒ ఎం.అచ్యుత అంబరీష్‌తో కలిసి ప్రభుత్వ చీఫ్‌విప్ ప్రసాదరాజు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు మాట్లాడారు. నియోజకవర్గ స్థాయిలో గెలుపొందిన వారు జిల్లా, రాష్ట్ర స్థాయిలో కూడా గెలుపొంది నరసాపురం నియోజకవర్గానికి మంచి పేరు తేవాలన్నారు. ప్రభుత్వం క్రీడాకారులకు అందిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్‌డిఒ అచ్యుత అంబరీష్ మాట్లాడుతూ క్రీడల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరూ ఓటమి, గెలుపును సమానంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బర్రి శ్రీ వెంకట రమణ, ఎఎంసి చైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


బహుమతులు అందజేస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు, ఆర్‌డిఒ

సుప్రీంకోర్టులో జగన్‌కు చుక్కెదురు

టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

టిడిపి అధినేత చంద్రబాబుపై ఇన్నర్ రింగ్ రోడ్డు వ్యవహారంలో జగన్ నమోదు చేసిన అక్రమ కేసుకు సుప్రీంకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలిందని టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి తెలిపారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో టిడిపి లీగల్ సెల్ నాయకులతో సీతారామలక్ష్మి మాట్లాడుతూ హైకోర్టు మంజూరు చేసిన ముందస్తు బెయిల్ రద్దు చేయాలని వైసిపి ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్ సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేయడంతో జగన్‌కు కంగారు మొదలై ఢిల్లీ ప్రయాణానికి సిద్ధమవుతున్నారని విమర్శించారు. టిడిపి, జనసేన నాయకులపై కక్ష కట్టిన జగన్ ప్రభుత్వం అక్రమ కేసులు బనాయిస్తూ ప్రజల దృష్టిని మళ్లించాలనుకోవడం అవివేకమన్నారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి వేండ్ర శ్రీనివాస్ మాట్లాడుతూ న్యాయం బతికే ఉందనడానికి న్యాయస్థానాలు నిదర్శనమన్నారు. టిడిపి లీగల్ జిల్లా అధ్యక్షుడు నీలాతి రమేష్, పట్టణ అధ్యక్షుడు ఇందుకూరి సుబ్రహ్మణ్యరాజు మాట్లాడారు. సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వేండ్ర శ్రీనివాస్, టిడిపి లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు నీలాతి రమేష్, పట్టణ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఇందుకూరి సుబ్రహ్మణ్యరాజు పాల్గొన్నారు.

రద్దు చేసిన పథకాలు అమలు చేయాలి

ప్రజాశక్తి - పోడూరు

దళిత ప్రజలకు జగన్ ప్రభుత్వం రద్దు చేసిన 27 సంక్షేమ పథకాలను అమలు చేయాలని టిడిపి, జనసేన ఎస్‌సి నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని వద్దిపర్రు, రావిపాడు గ్రామాల్లోని ఎస్‌సి వాడల్లో మంగళవారం జరిగిన ఇంటింటా ప్రచారంలో నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో దళితులు దగాకు గురయ్యారన్నారు. సంక్షేమ పథకాలు రద్దు చేయడం వల్ల దళితులు అనేక రకాలుగా నష్టపోయారన్నారు. కార్యక్రమంలో ఎల్లమెల్లి వెంకటరావు, కొండేటి నరేష్, కండెల్లి శ్రీను, వడ్లపాటి మోహనరంగా, వడ్లపాటి రాజేంద్ర పాల్గొన్నారు.

గణపవరం - బొబ్బిలి వంతెన నిర్మించాలి : సిపిఎం

ప్రజాశక్తి - గణపవరం

గణపవరంలో వెంకయ్య వయ్యేరుపైన ఉన్న బొబ్బిలి వంతెనను వెంటనే నిర్మించాలని సిపిఎం గణపవరం శాఖ సమావేశం ప్రభుత్వాన్ని కోరింది. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశానికి పార్టీ సీనియర్ సభ్యులు కె.త్రినాథ్ అధ్యక్షత వహించారు. సిపిఎం జిల్లా కమిటీ నాయకులు జక్కంశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలకు వారధిగా ఉన్న బొబ్బిలి వంతెన శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా ఉందన్నారు. వెంటనే వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలన్నారు. నిధుల మంజూరుకు ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు చొరవ చూపాలన్నారు. అనంతరం సిపిఎం గ్రామ నూతన కార్యదర్శిగా మేడిశెట్టి పెంటారావును ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి పెచ్చెట్టి నరశింహమూర్తి, మండల కమిటీ నాయకులు, పి.గోవిందు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

డిఆర్‌ఒ శివన్నారాయణ రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం

ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి బి.శివన్నారాయణ రెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై ఇంటర్మీడియట్ పబ్లిక్ ఎగ్జామినేషన్స్ జిల్లా కమిటీ సభ్యులు విద్యాశాఖ, పోలీస్, విద్యుత్, వైద్యశాఖ, మున్సిపల్ తదితర శాఖల అధికారులతో డిఆర్ఓ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పరీక్షలు మూడు దశలుగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఫిబ్రవరి 2వ తేదీన ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్ పరీక్ష, 3న ఎన్విరాన్మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్షలు జరుగుతాయని, ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ పరీక్షలను ఇంటర్మీడియట్ విద్యార్థులు తప్పనిసరిగా రాయాల్సి ఉంటుందన్నారు. ఈ పరీక్షలకు జిల్లాలో 111 పరీక్షా కేంద్రాల్లో 17,806 మంది విద్యార్థులు హాజరుకానున్నారని అన్నారు. ఫిబ్రవరి 5వ తేదీ నుండి 20వ తేదీ వరకు ప్రాక్టికల్ పరీక్షలు (ఒకేషనల్), ఫిబ్రవరి 11వ తేదీ నుండి 20వ తేదీ వరకు ప్రాక్టికల్ పరీక్షలు (జనరల్) నిర్వహించడం జరుగుతుందని, ఇవి రెండు పూటలా జరుగుతాయని అన్నారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు , మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షా సమయం అని అన్నారు. మార్చి 1వ తేదీ నుండి 20వ తేదీ వరకు థియరీ పరీక్షలు మొదలవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో రీజనల్ ఇన్‌స్పెక్టర్, కన్వీనర్ ఆఫ్ ఇంటర్మీడియట్ డిస్ట్రిక్ట్ ఎగ్జామినేషన్ కమిటీ కె.చంద్రశేఖర్ బాబు, డిస్ట్రిక్ట్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ కెవి.సత్యనారాయణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

ప్రజాశక్తి - మొగల్తూరు

యువత చదువులోనే కాదు క్రీడల్లో కూడా రాణించాలని కొవ్వలి ఫౌండేషన్ ఛైర్మన్ కొవ్వలి యతిరాజ రామ్మోహన్ నాయుడు అన్నారు. కొత్తట గ్రామంలో దాసాంజనేయ క్రికెట్ టోర్నమెంట్ ఆధ్వర్యంలో కొత్తట ప్రీమియర్ లీగ్ పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల టోర్నమెంట్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు. యువతను ప్రోత్సహిస్తూ క్రీడలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రథమ బహుమతి రూ.34,999, షీల్డ్ ప్రవాసాంధుడు యతిరాజ రామ్మోహన్ నాయుడు, ద్వితీయ బహుమతి రూ.14,999, షీల్డ్‌ను రాధా ట్రేడర్స్ అధినేత శ్రీదేవి స్వర్ణలత, మైన్ ఆఫ్ ది మ్యాచ్ బహుమతి శ్రీవీర హనుమాన్ ఆక్వా ఫీడ్స్ అందిస్తున్నారని తెలిపారు. మ్యాన్ ఆఫ్ ది టోర్నమెంట్ అవార్డు శ్రీరామచంద్ర సీ ఫుడ్స్, బెస్ట్ బ్యాట్స్‌మెన్ ఆఫ్ ది టోర్నమెంట్ అవార్డును రూ.3000, బెస్ట్ బౌలర్ ఆఫ్ ది టోర్నమెంట్ అవార్డు రూ.2000 రూపాయల నగదు నరసాపురానికి చెందిన ఎల్ఆర్‌సి ఫుడ్స్ అధినేత కత్తులు శ్రీనివాసరావు అందిస్తున్నారని నిర్వాహకులు టి.సతీష్, దాసరి శివకృష్ణ, రాజ్ కుమార్ తెలిపారు. కార్యక్రమాల్లో గట్టెం శ్రీను, సత్తినేని శ్రీనివాస్ తాతాజీ, రేవు పద్మారావు, లింగం ఏసుబాబు, పడవల గంగరాజు, సత్యనారాయణ ఉన్నారు.

వెయ్యి కిలోమీటర్లు పాదయాత్ర పూర్తి : ఎంఎల్ఎ రామరాజు

ప్రజాశక్తి - ఉండి

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు ఎంఎల్ఎ మంతెన రామరాజు ప్రారంభించిన ఇంటింటికీ టిడిపి కార్యక్రమంలో భాగంగా చేస్తున్న పాదయాత్ర మంగళవారంతో 1000 కిలోమీటర్లు పూర్తి చేసుకుంది. చెరుకువాడలో గ్రామ అధ్యక్షులు ఇర్రింకి సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహిస్తున్న కార్యక్రమంలో ఎంఎల్ఎ మంతెన రామరాజు కేక్ కట్ చేసి అభిమానులు నాయకులు కార్యకర్తలతో ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో వెయ్యి కిలోమీటర్ల పాదయాత్ర చేసి ప్రతి గ్రామంలోనూ ప్రజా సమస్యలను తెలుసుకోవడం జరిగిందని వెళ్లిన ప్రతిచోట ప్రభుత్వం పై విమర్శలు ఎదురవుతున్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వ్యవస్థలు అన్నింటిని నిర్వీర్యం చేయడం జరిగిందని టిడిపి జనసేన ఉమ్మడి ప్రభుత్వ ఏర్పాటు జరిగిన తర్వాత వ్యవస్థలను సక్రమ మార్గంలో తీసుకు వెళ్లే బాధ్యత చంద్రబాబు నాయుడు పవన్ కళ్యాణ్ తీసుకుంటారని ఏప్రిల్ తర్వాత ప్రజా సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షులు చెన్నంశెట్టి హరి నాయుడు, మండల ప్రధాన కార్యదర్శి కిన్నెర వెంకన్న, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు కట్టా రాంబాబు, పేరిచర్ల కృష్ణంరాజు పాల్గొన్నారు.


పాలకోడేరు : కేక్ కట్ చేస్తున్న టిడిపి నేతలు

పాలకోడేరు:ఇంటింటికీ తెలుగుదేశం.. ఇంటింటికీ మన రాంబాబు కార్యక్రమంలో భాగంగా ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు నియోజకవర్గంలో చేపట్టిన పాదయాత్ర వెయ్యి కిలోమీటర్లు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా పాలకోడేరు టిడిపి కార్యాలయంలో టిడిపి మండలాధ్యక్షులు దెందుకూరి ఠాగూర్ కోటేశ్వరరాజు ఆధ్వర్యంలో మంగళవారం వేడుకలు ఘనంగా నిర్వహించారు.కోటిరాజు భారీ కేక్ కట్ చేసి ఎంఎల్ఎ రామరాజుకు శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు దొంగ కృష్ణ, సాలా మల్లేశ్వరరావు, సంకురుడు, గాదిరాజు శ్రీనివాసరాజు, ఏడుకొండలు పాల్గొన్నారు.

కీచక ఉపాధ్యాయునిపై కఠిన చర్యలు తీసుకోవాలి

ఐద్వా, కెవిపిఎస్ నేతల డిమాండ్

ప్రజాశక్తి - అత్తిలి

బల్లిపాడులో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాస్ నెహ్రూపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కె.పద్మజ డిమాండ్ చేశారు. మంగళవారం ఆ పాఠశాల ప్రాంతాన్ని పరిశీలించి బాధిత విద్యార్థినులు, కుటుంబ సభ్యులతో ఐద్వా, కెవిపిఎస్ నేతలు మాట్లాడారు. విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఉపాధ్యాయుని నిర్వాకం మొత్తం ఉపాధ్యాయులకే మాయని మచ్చగా మారుతోందని పద్మజ ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా శ్రీనివాస్ నెహ్రూను ఉపాధ్యాయ వృత్తి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ప్రతి పాఠశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, గ్రామంలో సచివాలయ మహిళా కార్యదర్శి ప్రతివారం పాఠశాలను సందర్శించి పర్యవేక్షించాలని కోరారు. పిల్లలకు నెలకొకసారైనా గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్ గురించి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా నేత బంకురు యశోద, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షుడు బత్తుల విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

యలమంచిలి: అత్తిలి మండలం బల్లిపాడులో విద్యార్థినులపై లైంగిక దాడికి పాల్పడిన కీచక ఉపాధ్యాయుడు శ్రీనివాస నెహ్రూను కఠినంగా శిక్షించాలని ఐద్వా జిల్లా నేత సరిపల్లి జయప్రభ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు మంగళవారం చించినాడలో ఐద్వా ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో ఐద్వా మండల కార్యదర్శి జిల్లెల్ల ప్రశాంతి, నాయకులు చెట్టిమి నాగమణి, ముస్కాడి జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

గాంధీజీకి ఘన నివాళి

ప్రజాశక్తి - పాలకొల్లు

మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా మంగళవారం వాసవి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవి ఆర్యవైశ్య కళ్యాణ మండపం వద్ద గాంధీజీ విగ్రహానికి సంఘం అధ్యక్షులు మామిడి బాబు, ఎపి ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షులు మాటూరి నరసింహమూర్తి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. తరువాత పొట్టి శ్రీరాములు విగ్రహానికి సంఘం సలహాదారు భోగవిల్లి నాగభూషణం, కోశాధికారి మాఘం బాలకొండలరావు పూలమాలలు వేశారు. అలాగే గాంధీ బొమ్మల సెంటర్ వద్ద గాంధీ విగ్రహానికి సంఘ అధ్యక్షులు మామిడి శెట్టిబాబు, ప్రధాన కార్యదర్శి రేపాక ప్రవీణ్బాను పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో సంఘం కార్యదర్శి సలాది జనార్దనరావు, ఆఫీసు ఆర్గనైజర్ కొత్త వెంకట చంద్ర సోమరాజు, సంఘం సభ్యులు పన్నెంశెట్టి రామబ్రహ్మం గుప్త పాల్గొన్నారు.

మండలంలో గాంధీ వర్ధంతిసబలు

గణపవరం : గాంధీజీ వర్ధంతిని మండలంలో పంచాయతీల వద్ద నిర్వహించారు. సరిపల్లి గ్రామ పంచాయతీ వద్ద గ్రామ సర్పంచి లక్ష్మీ భవాని, సచివాలయ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు.

మొగల్తూరు : మొగల్తూరులోని ఆర్యవైశ్య కళ్యాణ మండపం వద్ద గాంధీజీ వర్ధంతిని వాసవీ, వనిత క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసరాలను పరిశుభ్రం చేశారు. అనంతరం గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.


సత్యం, అహింస ఆయుధాలుగా చేసుకుని దేశానికి స్వతంత్రం తీసుకొచ్చిన మహోన్నత వ్యక్తి మహాత్మా గాంధీ అని టిడిపి నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు అన్నారు. ముత్యాలపల్లి పంచాయతీ పరిధి గెదల్లవంపు గ్రామంలో గాంధీ వర్ధంతిని టిడిపి నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీజీ విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. అనంతరం గాంధీజీ సిద్ధాంతాలను వివరిస్తూ ముద్రించిన కరపత్రాల ప్రజలకు అందించి వివరించారు. అనంతరం గ్రామంలో ప్రదర్శన చేశారు.

నరసాపురం : వైఎన్ కళాశాల, గాంధీ అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో గాంధీజీ వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల కరస్పాండెంట్ చినమిల్లి సత్యనారాయణరావు, ట్రెజరరీ పి.రఘు రామారావు మాట్లాడారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్ కనకారావు అధ్యక్షత వహించారు. గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కళాశాల నుండి గాంధీ బొమ్మ సెంటర్ వరకూ విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు.

పెనుగొండ : పెనుగొండ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచి నక్కా శ్యామలాసోనీ గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో పంచాయతీ జూనియర్ అసిస్టెంట్లు జి.భార్గవ్‌నాయుడు, సిహెచ్.కళ్యాణ్‌బాబు, జెసి.రామకృష్ణ ఎస్.రామలింగయ్య పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలను భయపెడితే ఊరుకోం : పితాని

ఆచంట:మనసారా ఆసరా పేరుతో పది రోజుల పాటు డ్వాక్రా మహిళలు ఐదు వేల మందితో కులాలకు మతాలకు పార్టీలకు అతీతంగా నిర్వహిస్తున్నామని చెప్పిన ఎంఎల్ఎ చెరుకువాడ పార్టీ రంగులు వేసి డ్వాక్రా మహిళలను డ్వాక్రా సిఎలతో భయపెట్టి తూర్పుపాలెం తరలిస్తున్నారని, బెదిరింపులకు దిగితే ఖబడ్దార్ అని మాజీ మంత్రి పితాని సత్యనారాయణ విమర్శించారు. మంగళవారం మండలం పెదమల్లం, కోడేరు గ్రామాల్లో ప్రజల వద్దకు పితాని పాదయాత్ర నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎంఎల్ఎ రంగరాజు కక్ష పూరిత రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. వైసిపి ప్రభుత్వం నవరత్నాల పేరిట ప్రజలను మోసం చేస్తోందన్నారు. గ్రామ పంచాయతీ నిధులు మళ్లించి సర్పంచులకు నిధులు లేకుండా చేశారన్నారు. ఆచంట గ్రామంలో మూడు రోజుల క్రితం డెంగీతో యువకుడు మృతి చెందాడం బాధాకరమన్నారు. అయితే సర్పంచి భర్త అధికారులను పక్కదారి పట్టించారని, విశాఖపట్నంలో డెంగీ బారిన పడి మృతి చెందినట్లు చెప్పారని, అయితే వాస్తవానికి మూడు సంవత్సరాల నుండి వర్క్‌ఫ్రం హోమ్ చేస్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆచంటలోనే ఉంటూ డెంగీ బారిన పడి మృతి చెందాడని వార్తల్లో రాకుండా స్థానిక నాయకులు అడ్డుకున్నారని విమర్శించారు. ఎంఎల్ఎ ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నాడని విమర్శించారు. అనంతరం కోడేరులో వైసిపి నుండి ఏడుగురు టిడిపిలో చేరారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్ బాబు, దిగమర్తి సూర్యకుమారి, టిడిపి మండల అధ్యక్షుడు కేతా మీరయ్య పాల్గొన్నారు.


ఎంఎల్ఎ నిమ్మలను కలిసినటి సినీ నటుడు నారాయణమూర్తి

ఎంఎల్ఎ నిమ్మలను కలిసిన సినీనటుడు నారాయణమూర్తి

ప్రజాశక్తి - పాలకొల్లు

ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో మంగళవారం సినీ నటుడు, దర్శకుడు, ఆర్.నారాయణమూర్తి ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపు మీదేనంటూ ప్రత్యేకంగా ఎంఎల్ఎను అభినందించారు. ఈ సందర్భంగా నారాయణ మూర్తిని ఎంఎల్ఎ సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఇరువురు రాష్ట్ర రాజకీయాలపై చర్చించారు.

విద్యార్థులకు ఆర్థిక చేయూత

నరసాపురం:వైఎన్ కళాశాల, టేలర్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం సింథసిస్ సహకారంతో ఆర్థిక స్తోమత లేని ప్రతిభావంతులైన విద్యార్థులకు ఫీజుల నిమిత్తం రూ.60,000 సమకూర్చి అందజేశారు. ఎంసిఎ మొదటి సంవత్సరం చదువుతున్న వి.నాగేంద్ర, ఎంబిఎ మొదటి సంవత్సరం చదువుతున్న టి.రజని, బిఎ ద్వితీయ సంవత్సరం చదువుతున్న టి.శ్రీనివాస వర్మకు ఈ సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాలేజీ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ చినమిల్లి సత్యనారాయణ, ప్రిన్సిపల్ కనకరాజు, సింథసిస్ సభ్యులు పాల్గొన్నారు.